# అడ్డు వచ్చే అంతస్తులు

"చిత్ర"

కథానిక

సీనయ్య ఐదుగురు పిల్లల్ని తీసుకుని చొల్లంగి తీర్థానికి బయల్దేరాడు. చంటివాడిని ఒక భుజంమీద బుల్లినొక భుజంమీద ఎక్కించుకున్నాడు. కావమ్మ అంటే పెద్దది నెల్లాళ్ళనుంచి తాసిల్దారుగారింట్లో చంటి పిల్లాడిని ఎత్తుకుందుకి కుదిరింది. వాళ్ళనడిగి తెచ్చుకున్న భుజంమీద చిరిగిన సిల్కు గౌనుతో సంబరంతో కరిగెత్తింది. "నానా!... దాన్నేమంటారు?..." అడిగాడు చంటాడు.

"దాన్ని భోరా అంటరురా... ఆ పక్కనున్నది బుడగ. మీకు తలొక అణా యిస్తాను. మీ యిట్టమొచ్చింది తెచ్చుకుంద్రా..."

"నానోయి... నాకు అణా యెట్టి పొట్లాం తేరా నాకా బూరా వొద్దు..." అంది పెద్దది. దానికి బూరా ఒక గంట కన్నా వుండదని బాగా తెలుసు. పొట్లాం తినాలని ఎన్నాళ్ళనుంచో వుంది. ముఖ్యంగా వుల్లిపాయ పకోడీ లంటే నోట్లో నీరు నిండుతుంది. ఒకసారి అమ్మగారింట్లో బాబుగారికి తెచ్చిపెడ్తూంటే తను ఎదురుకుండా నుంచుని చూస్తోంది. అమ్మగారు కోపంగా అరిచారు.

"ఏమే పిల్లదానా!... ఫో అవతలకి. అబ్బాయి తింటూంటే చూడ్డం ముచ్చటా ఏం?... వాడికి కొట్టుడి, ఏనాడయినా తింటేగా..." అంది. కావమ్మ చిన్న మొహం చేసుకుని అవతలికెళ్ళింది. బంగారి పక్కకి పిల్చి చెప్పింది "నీ కంతా కొత్తేనే అమ్మగారు వాళ్ళు తింటూంటే అలా ఎందుకు కోద్యం చూత్తావు... అత్తమాను అలదగ్గర నుంచోద్దని, మీదికెళ్ళి మాట్లాడొద్దని సెప్పలా," అంది జాలిగా. దానికి గౌరవమర్యాదలు కాచి వడబోసినవే. ఈ మాట విని పిల్ల కంట తడిపెట్టుకుంది.

ఇంటికొచ్చి పొట్లాం చూరులో పెట్టి అన్నం వండేందుకు కూర్చుంది. సీనయ్య యీమధ్యనే రెండోపెళ్ళి చేసుకున్నాడు. మొదటి పెళ్ళాం చనిపోయి రెండు నెలలు కాబోలు కావస్తోంది. ఎర్రమ్మ యీ అయిదురు సవతిపిల్లల్ని చూసి తల మొత్తుకునేది. సీనయ్య పిల్లల్ని చెరోవైపు పడుకోబెట్టుకుని వాళ్ళతో పాటు ఒకే గిన్నెలో తినేవాడు. యింత ప్రేమ పిల్లలమీదే వుంటే తనపైన ఏమీ మిగిలి వుండదని దాని నమ్మకం. రాత్రల్లా ఎర్రమ్మ పెద్ద జగడం వేసుకుని మూటతో పుట్టింటికి వెళ్ళిపోయింది. సీనయ్య ఎన్ని కబుర్లు పినా ఖాతరు చేయలేదు. పాపం... పెద్దది పని చేసుకుని వచ్చేలోగా సీనయ్య రొయ్యలపులుసు కూరచేసి పెట్టేవాడు. ఇవాళ కావమ్మ తండ్రిని కూర్చోపెట్టి తనే వంట ప్రారంభించింది: "నానోయ్... పుల్లలు మండటంలేదు. కుంపటి ఊదుకులు ఏరుకురారా..." అని కేకవేసింది. సీనయ్య ముసలయ్యతో కూర్చుని ప్రపంచ విషయాలు ముచ్చటిస్తున్నాడు. ఈ మాట కట్టించుకోనే లేదు. మరి కాస్తసేపులో కావమ్మ కళ్లు రెండూ మూసుకుని వలవలా ఏడుస్తూ తండ్రి ఒళ్లోకివాలింది. పకోడీపొట్లాం తీసుకుని అవతలజల్లి, చంటాడు పెద్ద తగవులాట. సీనయ్య పెద్ద నిట్టూర్పు విడుస్తూ బాధగా అన్నాడు:

"కుర్రదాన్ని చూశా ముసలాయ్!... బొత్తిగా యీనుపుల్లయి పోతంది. ఎర్రమ్మనూత్తే ఆ తోవ నుంది. నాపాటు ఆ భగమంతుడే సూడాలయ్యా. పోనీ వుండు కుర్రదానా, నేను కూంత పప్పోలును వుడకేసి వత్తాను. పొగల్లాపని రేతిరల్లా కుర్రోళ్ళ రొద..." అని తను వెళ్ళాడు.

ముసలాయ్ మనుమడు లారీ నడుపుతూంటాడు. వారానికి ఒకరోజు లారీమీద వచ్చి చెల్లెళ్ళని కాలువదాకా తిప్పి తెస్తూంటాడు. ఆ రోజల్లా ముసలాయ్ మనుమడితో సామర్లకోట, పిఠాపురంలో ఎక్కడేవిషయాలు జరిగినాయో పూసగుచ్చినట్టు అడిగి తెలుసుకునేవాడు. సామర్లకోట నుంచి చెఱకు కట్టలు ఫ్యాక్టరీకి మోసుకెళ్ళాల్సి వచ్చి

చెల్లెళ్ళకోసరం రెండు గడలు తెచ్చాడు. కావమ్మ పుల్లమ్మతో ప్రాణాధికంగా వుంటుంది. అన్నగారు తెచ్చిన గెడలో చిన్నముక్క కావమ్మ ఒడిలో పడేసి పోయింది.

"పుల్లమ్మా ... నాకు లారీ ఎక్కాలనుంది ఎక్కించుతావా?... మీ అన్నతో సెప్పకుబాబో. నా జుట్టట్టుకుని లాక్కెల్తాడు. అప్పుడలాగే తలంతా నాగేసింది" అంది ప్రాధేయపడుతూ. పుల్లమ్మ బుర్రవూపుతూ వెళ్ళిపోయింది.

సాయంత్రం ముసలాయన మనుమడు కోటయ్య తాతను తల్లిని తండ్రిని, చెల్లెళ్ళనుకూడా తీసుకుని రాత్రి రెండో ఆట సినిమాకి ప్రయాణమయాడు. వాడికి యీ నెలనుంచి డెబ్భయిరూపాయలు చేశారుట. ఆ సంతోషంకొద్దీ సినిమా చూపెడుతున్నాడు. కావన్న కళ్ళు నలుపుకుంటూ లేచి చూస్తోంది. కోటయ్య కళ్ళు దానిమీద పడ్డాయి. కావమ్మ మంచందగ్గరకెళ్ళి "సీనయమామా!... కావమ్మని సినెమాకి పంపుతావా!" అని అరిచేసరికి సీనయ్య లేచి కూర్చుని నెమ్మదిగా అన్నాడు, "పోన్లేరా ... వచ్చేసరికి తెల్లారుద్ది ... పనిలోకి పోవాలె ... మెలుకువగా వుండదేమోరా ..." అన్నాడు. కావమ్మ తెలీనట్టు ముడుచుకుని పడుకుంది. తండ్రి సమాధానం దాన్ని నిరుత్సాహపర్చింది. కోటయ్య, కావమ్మని తీసికెడదామని గట్టిపట్టుదలమీదున్నాడు కాబోలు కావమ్మ మంచందగ్గరకొచ్చి తొంగిచూశాడు. వీధి దీపం వెలుతురు దాని మొహంమీదపడి కంటినీరు తెల్లగా మెరిసింది. "మేలుకునే వున్నావే!... లెగవే సినిమా సూద్దువుగాని" అని అరిచాడు. ముసలాయనకి కోడలికి యిదంతా చాలా చికాకుగా కనిపించింది. కోటయ్య మాటకు కావమ్మ లేచి కూర్చుంది. పుల్లమ్మ చెయ్యి పట్టుకుని లాక్కింది. సీనయ్య వెళ్ళకుని అనేసరికి రెండు నిమిషాలలో తెమిలి వాళ్ళతో కలిసి వెళ్ళింది.

• • •

మనసనేది, ఆలోచన అనేది యీ తుచ్ఛ మానవులకు ప్రత్యేకంగా ఎందుకు ప్రసాదించాడో ఆ భగవానుడు అర్థంకాదు. మనసనే అతి సురక్షితమైన ప్రదేశంలో అనేక ఆలోచనలు అంటే మంచివి, చెడ్డవి వుంటాయి. అవి వినియోగించటం దాకా వస్తే వారి సహజ స్వభావం బయట పడుతుంది. కాని యిదంతా తెలుసుండి కూడా ఎవరూ వుద్రేకాన్ని, లోకిగాన్ని విడువలేరు. కావమ్మ మనసుకు ఈమధ్య ఎలాటి ఆలోచనలు ఒస్తున్నాయో అది ఎలా మారిందో వినేవాళ్ళు చకితులవుతారు. బాబుగారు పెద్ద చదువు చదువుకున్నారు. తను వాళ్ళింట్లోనే తన జీవితం వెళ్ళబుచ్చుకుంటోంది. ఇంటి పనంతా తానే చూసుకుంటోంది. గౌరవంగా మాట్లాడటం ఎవరి వేళకు వాళ్ళకి తోడుపడటం యివన్నీ తెలివిగా నేర్చుకుంది.

బాబు పుస్తకాలు సవరించుకుంటూ కావమ్మని పిల్చాడు "ఏమే... కాస్త నే నిచ్చే పుస్తకాలు సమంగా అలమారులో పేరుద్దూ" అన్నాడు.

"బాబూ ... మీరు నిన్న వీధిట్లో వదిలిన పుస్తకాలు తెచ్చి అలమారులో పెట్టా బాబూ. ముందుగా మీరు వన్నం తిని రండి. ఈ పనంతా నేను చేసుకుపోతాను" అంది.

యిప్పుడు కావమ్మ తాసిల్దారుగారింట్లో ఒక మనిషయిపోయింది. బాబు దాంతో అన్నీ ముచ్చటించి సలహాలు తీసుకోవటం మానలేకుండా వున్నాడు. "నువ్వు పెళ్ళయి వెళ్ళిపోతే ఎలానే కావమ్మా...యిల్లంతా నీ చేతిలో వుండిపోయింది." ఈమాటకు కావమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ వెళ్ళిపోయింది.

కోటయ్య తోవలో కన్పించి కావమ్మని పలకరించాడు. "ఏటే యీమద్దిన బొత్తిగా అగపడ్డంలేదు. మీ బాబు పిల్లోణ్ణి చూడమని చెప్పినాడు... నాతో మాట్లాడాలనుకుంటే నువ్వు నలుసై నావు" అని నవ్వాడు. కావమ్మ ముందుకుసాగుతూ అంది "అలాటిమాటలు నానేంచెప్తా కోటయ్యా!... బాబు మాట నీకే తెలియాలి... నానైతే పెళ్ళిమాటే తలపెట్టను."

"ఐతే పడుసుదానివికదా ఎన్నాలుయీవిదంగా వుంటావే!..."

"నేనేం తప్పుడుపనులుకాని సేసానేటి ..ఏదీ ఏమొగాన్నయినా, నావంక వేలెట్టి వంక సెప్పమను!" అంది గర్వంగా.

"పోయెహే...యిలాటి మాటలు నాదగ్గర కానీకు. నీలా కబుర్లుసెప్పినాళ్ళంతా చాలా పెద్దాళ్లయారు తెలుసా! ఒక్కమాట సెప్తాయిను... నామనసంతా నీమీదనే...మరి ఆపైన నీయిష్టం"

ఈమాటకు కావమ్మ నిలబడిపోయింది. తనుయింత అందగత్తెఅయికూడా యీమాట యిన్నాళ్లుఎందుకు గ్రహించుకోలేదో తెలీలేదు. కానైతే పమిట వంపుగా వేసుకోవటం తల్లో పువ్వులు తురుముకోవటం యిలాటివి తెలుసుకానీ యిదిమాత్రం ఎందుచేతనో దానికి తట్టనేలేదు. పైగా తన బాబుగారితో యీ కోటయ్య నిలబడగలడా!... అంటే దానికి కాబోయేవాడు అచ్చం బాబుగారిలాగే వుండివుండాలని దాని ఆశ.

"నీకు సమపదీరాదు...నువ్వు ఏంటి సెప్తున్నావో నాకేదీ తెలీటంలేదు కోటయ్యా..."

"మరి సిన్నకప్పట్నుంచి నీకోసం పాకులాడుతున్నా కదుటే...అదేపేరిమంటే...డబ్బు సంపాదనకి సదువేటి? నా జీతం నీ సోకులకి సాలదంటే."

"ఏమోకోటయ్యా నాకేటి తెల్దు. బాబు వింటే ఏటైనా అంటాడేమో!"

"నీబాబు నిన్ను నాసేతుల్లో పెట్టాడే...యిదే అడిగి తెల్సుకోనాకి వచ్చాను. వారంలో మన పెళ్ళి నిశ్చయం. ఆపైన సామలకోటలో కాపురం. తాతని ఆలని తీసికెల్లొద్దు" అంటూ గడ్డంపైకెత్తి మొహంలోకి చూశాడు. కావమ్మ మొహం నిశ్చలంగావుంది. కనుచీకటివేళ వీళ్ళిద్దర్నీ వచ్చేపోయే వాళ్ళు గమనించలేదు.

కావమ్మ రాత్రల్లా పడుక్కుని ఆలోచించుకుంది. దాని మనసులో ఆనందంతోపాటు బాధకూడా సూది పోటులా తగిలింది. తను కోటయ్యని చేసుకోకపోతేనేం!...కోటయ్య తనను చిన్నప్పట్నుంచీ ఎంతో అభిమానంగా చూస్తున్నాడు. కోటయ్య గూడెం అంతటికీ పెద్ద. వాడి మాటంటే విలువెక్కువ. కాని బాబుగారిలా ఎక్కడ ఉండగలడు. అంత చదువు అంత దర్జా...బాబుగారు మాట్లాడుతోంటే ఒళ్ళంతా జలదరించి నవ్వు, సంతోషం పుటికివస్తుంది!

ఇదే ఆలోచనతో తెల్లవారి అమ్మగారింటికెళ్ళింది. బాబు పెద్దపట్నం ప్రయాణంలో వున్నాడు. ఆవాళ తనతో మాట్లాడలేదు. వెళ్ళిపోతూ రూపాయితీసి చేతులోపెడ్తూ అన్నాడు "కావమ్మా!.. అమ్మను కనిపెట్టుకునివుండు. నేను మూడు నెలలదాకా రావటం పడదు...అన్నట్టు నీకు పెళ్ళని విన్నాను. నేను వచ్చేప్పుడు సిల్కుచీర తెచ్చి పెడతాలే" ఈ మాటలు వింటూంటే దానికి బాధనిపించింది. బాబుగారికి దానిమీద ఏం భావాలుంటాయి! అది డబ్బుకోసం పనిచేస్తోంది. వాళ్ళు పనికోసం పెట్టుకున్నారు. ఇదే వారి మధ్యనవున్న సంబంధం.

• • •

కావమ్మ యిద్దరి పిల్లల తల్లయింది. కోటయ్య డబ్బు హెచ్చవుతోన్న కొద్దీ తాగుడూ సిగరెట్లు ఎక్కువచేస్తున్నాడు. కావమ్మ యివన్నీ తల్చుకుని కుమిలిపోయింది. ఇప్పుడు తండ్రి కూడా చనిపోయాడు. పెద్దాడు పిండి మరలో పనిచేసుకుంటూ బుల్లిని చంటాడిని పోషిస్తున్నాడు. తమ్ముడిని చూసి రావాలని పుట్టింటికి వెళ్ళింది. బాబుగారి జవాను కనిపించి బాబుగారికి పెళ్ళయినట్టు అమ్మాయి కూడా పుట్టిందని చెప్పేసరికి వెళ్ళి చూసి రావాలని బయల్దేరింది. బాబుగారు చాలా మారారు. అమ్మాయి నెత్తుకుని కూర్చుంది బాబుగారి భార్య.

"నా నెవరో గాపకమున్నా నా బాబూ!..."

"ఓ నువ్వా? ... ఎందుకులేదు! నిన్ను చూసి నాళ్లేళ్ళు పైన అయిందనుకుంటాను. వాళ్ళిద్దరూ నీ పిల్లలే!... సరళా! ... యిది నా చిన్నప్పట్నుంచి మనింట్లో పనిచేసింది. ఒక ఐదురూపాయలుంటే యియ్యి..." అని లోపలికెళ్ళిపోయాడు.

"నాకు డబ్బొద్దు బాబూ... చూసిపోదామని వచ్చానండి" అని లేచింది. పెద్దమ్మగారు గబగబా పాతచీర, రవిక తెచ్చి యివ్వబోయారు.

"మీరంతా సుకంగా వుంటం కావాలి అమ్మగారూ! నేనంత పేదదాన్ని కానండి. నా మొగుడు వంద సంపాయిస్తున్నాడు అమ్మా...యిలా తీసుకున్నానని తెలిస్తే కూకలేస్తాడు. అమ్మా యెల్తాను" అని లేచి వెళ్ళిపోయింది. దానికి సామర్లకోటలో కోటయ్యదగ్గరే సుఖమనిపించింది. తాగొచ్చేక తినే తన్నులు, ఆ పైన ప్రేమగా దగ్గరకి తీసుకొని లాలించడం ఇవన్నీ అలవాటయ్యాయి శరీరానికి. పెద్దవాళ్ళెప్పుడూ పెద్దవాళ్ళే. ★